


గుంటూరు కారం ఓటీటీ వివరాలు ఇవే.!

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...




ప్రచురణ : హైదరాబాద్, శుక్రవారం 9-2-2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 1399 పేజీలు : 4 వెల : 5-00

## కాంగ్రెస్ బ్లాక్ పేపర్‌పై ప్రధాని వ్యాఖ్య

-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి మన్మోహన్ సింగ్ చక్రాల కుర్చీలో వచ్చారు మోదీ ప్రశంసలు – రాజ్యసభలో 68 మంది సభ్యులకు వీడ్కోలు



ల న్యూఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వ పదేళ్ల పాలనా వైఫల్యాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన బ్లాక్ పేపర్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టి చుక్కగా అభివర్ణించారు. దేశం అభివృద్ధి తాలూకు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోందని చెప్పారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు ధరించిన నల్ల దుస్తులు, ఆ పార్టీ విడుదల చేసిన బ్లాక్ పేపర్ దేశ పురోగతి యాత్రకు దిష్టి తగలకుండా పెట్టిన 'దిష్టి చుక్క'గా భావించవచ్చని పేర్కొన్నారు. రాజ్యసభ నుంచి 68 మంది ఎంపీల పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో వారి వీడ్కోలుపై గురువారం సభలో జరిగిన చర్చలో ప్రధాని మోదీ మాట్లాడారు.

# జాబితాలో ఉన్న వారే రావాలన్న మంత్రులు

- బీఏసీకి హరీశ్ రాకపై అభ్యంతరం
- దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న శ్రీధర్‌బాబు
- సర్దుకు పోవాలంటూ స్పీకర్ చెప్పడంతో బయటకు వచ్చిన హరీశ్

**కేసీఆర్‌కు బదులు తాను పాల్గొనడంపై సమాచారం ఇచ్చామన్న మాజీ మంత్రి**



**హైదరాబాద్:జర్నలిస్ట్ వార్త** శాసనసభ నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో మంత్రులు, మాజీ మంత్రి హరీశ్‌రావు మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత కేసీఆర్‌కు బదులు హరీశ్‌రావు బీఏసీ భేటీకి హాజరు కావడంపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ చాంబర్‌లో బీఏసీ తొలి సమావేశం ప్రారంభమైంది.

అధికార పార్టీ తరఫున శ్రీధర్‌బాబు, పొన్నంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రతిపక్ష బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, కడియం శ్రీహరి హాజరయ్యారు. తాను అనారోగ్యంతో బాధపడుతున్నందున తనకు బదులుగా హరీశ్‌రావు బీఏసీ సమావేశంలో పాల్గొంటారంటూ మాజీ సీఎం కేసీఆర్ బుధవారం స్పీకర్‌కు సమాచారం ఇచ్చినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అయితే శ్రీధర్‌బాబు, పొన్నం అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాగ్వాదం జరిగింది. కేసీఆర్‌కు బదులుగా తాను హాజరయ్యేందుకు స్పీకర్ అంగీకరించారని హరీశ్ చెప్పారు. అయితే ఈ అంశంపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కాబట్టి హరీశ్‌రావు హాజరయ్యేందుకు వీలు లేదని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**అలా హాజరయ్యేందుకు వీలు లేదు: శ్రీధర్‌బాబు**

తాము ఎవరిని బీఏసీ సమావేశం నుంచి బయటకు వెళ్ళమని చెప్పలేదని శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్పీకర్ నిర్ణయం మేరకు బీఏసీ సమావేశంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ నుంచి ఇద్దరు సభ్యులకు అవకాశం కల్పించారని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ తరఫున మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కడియం శ్రీహరి పేర్లు ఇచ్చారని తెలిపారు.

# యూపీఏ పదేళ్ల పాలన



**న్యూఢిలీజర్నలిస్ట్ వార్త** యూపీఏ పదేళ్ల పాలన(2004-2014)ను తూర్పార పడుతూ కేంద్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం లోక్‌సభలో శ్వేతపత్రం ప్రవేశపెట్టింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వైట్‌పేపర్‌ను టేబుల్ చేశారు. వైట్‌పేపర్‌లోని మొదటి 24 పేజీల్లో పదేళ్ల యూపీఏ పాలనలో జరిగిన వైఫల్యాలను, అవినీతిని వివరించారు. అప్పట్లో వెలుగు చూసిన 2జీ, కామన్‌వెల్త్, శారదా చిట్‌ఫండ్ తదితర కుంభకోణాలను ప్రస్తావించారు. 1991లో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చింది తామేనని చెప్పే యూపీఏ నేతలు 2004లో పవర్‌లోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా మరిచిపోయారని వైట్‌పేపర్‌లో కేంద్రం విమర్శించింది. కేవలం పదేళ్లలో దేశాన్ని 'ఫ్రాజైల్ ఫైవ్' స్థితి నుంచి టాప్ ఫైవ్‌లోకి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపింది. కొవిడ్, పలు దేశాల మధ్య యుద్ధాలు లాంటి పరిస్థితులను కూడా అధిగమించి దేశ ప్రగతిని పరుగులు పెట్టించామని పేర్కొంది.


## ఎస్‌జీటీలుగా 2008-డీఎస్సీ అభ్యర్థులు

- బీఎడ్ వారిని నియమించే అంశాన్ని పరిశీలించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- ఏపీ సర్కార్ ఈ విషయంలో మంచి నిర్ణయం తీసుకుందన్న కోర్టు

, **హైదరాబాద్‌జర్నలిస్ట్ వార్త** : డీఎస్సీ-2008 అభ్యర్థులను ఎస్‌జీటీలుగా నియమించే అంశాన్ని పునఃపరిశీలించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

నాటి డీఎస్సీ మెరిట్ జాబితా ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని ఈ సమస్యకు ఏపీ సర్కార్ కొంత ఉపశమన నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడింది. అయితే తెలంగాణలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. 2008- డీఎస్సీ నోటిఫికేషన్‌లో తమ కంటే తక్కువ అర్హత ఉన్న డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్‌జీటీ పోస్టులను రిజర్వు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఎడ్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఒకే రకమైన పోస్టులకు అర్హత ఎక్కువున్న వారిని కాదని.. తక్కువ ఉన్న వారిని నియమించడం చట్టప్రకారం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. 'ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు చేసేటప్పుడు



రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4)కు లోబడి క్లాసిఫికేషన్ చేయాలిగానీ.. ఇష్టం వచ్చి నట్లు నిర్ణయం తీసుకోవడం చెల్లదు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2008 బీఎడ్ అభ్యర్థుల విషయంలో ఆ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.




# ఇండియా'కు మరో షాక్..

ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన ఆప్

## కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్:జర్నలిస్ట్ వార్త** మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ప్రసంగం? తర్వాత రేవంత్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.

కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్ అని, ఆయన ఇంకా ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను పట్టించుకోవడంలేదని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి, బీఏసీకి కూడా రాలేదంటే కేసీఆర్ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చున్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నానన్నారు. ప్రతిపక్షనేతగా ఆయన తన బాధ్యత నిర్వర్తించాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత గది మార్పు నిర్ణయం స్పీకర్‌కు సంబంధించినదని చెప్పారు. బీఏసీ సమావేశానికి రాకుండా హరీశ్‌రావును తాము ఎందుకు అడ్డుకుంటామన్నారు.

బీఏసీకి వచ్చేవారి జాబితాలో కేసీఆర్ కడియం శ్రీహరి పేరు ఇచ్చారన్నారు. హరీశ్‌రావుకు బీఏసీకి అనుమతివ్వాలో లేదో స్పీకర్ నిర్ణయిస్తారు. రేపు బీఏసీకి కేసీఆర్ మనవడు హిమాన్షు కూడా వస్తానంటే ఎలా అని రేవంత్ ప్రశ్నించారు.

ఈ అసెంబ్లీ సెషన్‌లో రాష్ట్రంలో కులగణనపై తీర్మానం ఉంటుందని చెప్పారు. టీఎస్పీఎస్సీపై పూర్తి పప్రొసీజర్ ప్రకారం ముందుకు వెళుతున్నామన్నారు. మరిన్ని అంశాలు చర్చించాల్సిన అవసరం ఉంది అనుకుంటే స్పీకర్ సభను పొడిగించవచ్చున్నారు. కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్(కేఆర్ఎంబీ)కి ప్రాజెక్టులను అప్పగించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. కృష్ణా బేసిన్‌లో? బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని చెప్పారు. సీఎంగా తాను ఎవరినైనా కలుస్తానని, అవసరమైతే కేసీఆర్‌ను కూడా కలుస్తానని రేవంత్ అన్నారు.

# చాంబర్ కేటాయింపుపై రగడ

- కేసీఆర్‌కు ఈ చాంబర్ ఏంటి?
- కసీఆర్‌కు ఔటర్ లాబీలో ఇరుకైన గది
- స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు.. వచ్చే
- సమావేశాల్లోగా పరిష్కరిస్తామని హామీ

**హైదరాబాద్: జర్నలిస్ట్ వార్త** శాసనసభ ఇన్నర్ లాబీలో అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి ఏళ్ల తరబడి కేటాయిస్తూ వస్తున్న చాంబర్‌ను తొలగించి తాజాగా కె.చంద్రశేఖరరావుకు ఔటర్ లాబీలో ఇరుకైన చిన్న గదిని కేటాయించడంపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శాసనసభ సమావేశాల తొలిరోజున గురువారం గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ చాంబర్‌కు వెళ్లి తమ నిరసన తెలిపారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు, సీనియర్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి తదితరులు కేసీఆర్ చాంబర్‌ను మార్చడాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. 39 మంది ఎమ్మెల్యేలకు నేతృత్వం వహిస్తున్న ప్రధాన ప్రతిపక్షం నేత కార్యాలయా న్ని ఇన్నర్ లాబీ నుంచి ఔటర్ లాబీకి మార్చడాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచీ ఇన్నర్ లాబీలో ప్రధాన ప్రతి పక్ష నాయకుడికి ప్రత్యేక చాంబర్‌ను కేటాయి ంచడం ఆనవాయితీగా వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతకు కేటాయించిన చాంబర్‌ను ఔటర్ లాబీకి తరలించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రొటోకాల్ ఉల్లంఘనలపైనా ఫిర్యాదు**

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తూ నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు సంబంధించిన పలు సంఘటలను కూడా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతున్నా ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి భార్య వచ్చేంత వరకు సుమారు రెండు గంటల పాటు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిలిపివేశారన్నారు.



నర్సాపూర్, దుబ్బాక, జహీరాబాద్ తదితర నియోజకవర్గాల్లోనూ ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థులను పోలీసులు ఎస్కార్ట్ వాహనంతో అనుసరిస్తున్నారని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను కోరారు.

# సుకన్య సమృద్ధి యోజన

## మార్చి 31లోపు ఈ పని చేయకపోతే మీ ఖాతా మూసివేయబడుతుంది!

%మహిళలు, పిల్లల కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళలను స్వావలంబన చేసేందుకు ఈ పథకాలు ప్రారంభించబడ్డాయి. ఈ పథకాలలో సుకన్య సమృద్ధి యోజన ఒకటి.ముఖ్యంగా బాలికల కోసం ఈ పథకం ప్రారంభించబడింది.ఈ పథకంలో, బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టారు. ఈ పథకంలో, సుకన్య సమృద్ధి ఖాతాను యాక్టివ్‌గా ఉంచడానికి కనీస నిల్వ అవసరం. పెట్టుబడిదారుడు కనీస నిల్వను నిర్వహించకపోతే, అతని ఖాతా సస్పెండ్ చేయబడుతుంది. ఖాతాను తిరిగి యాక్టివేట్ చేసినందుకు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

మార్చి 31, 2024 నాటికి, ఖాతాదారులు తప్పనిసరిగా కనీస బ్యాలెన్స్‌ను నిర్వహించాలి. వారు దీన్ని చేయకపోతే వారి ఖాతా నిష్క్రియంగా ఉంటుంది. ఖాతాను పునఃప్రారంభించేందుకు ఖాతాదారు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.మినిమమ్ బ్యాలెన్స్ కోసం ఎంత మొత్తం డిపాజిట్ చేయాలి?సుకన్య సమృద్ధి యోజనలో కనీస నిల్వ రూ. 250. ఖాతాదారుడు ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో రూ.250 డిపాజిట్ చేయకపోతే అతని ఖాతా ఇన్‌యాక్టివ్‌గా మారుతుంది.నిష్క్రియ ఖాతాను తిరిగి తెరిచేందుకు సంవత్సరానికి రూ. 50 జరిమానా చెల్లించాలిసుకన్య సమృద్ధి యోజన 8.2 శాతం వడ్డీని అందిస్తుంది. ఈ పథకంలో, పెట్టుబడిదారులు ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 250 మరియు గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి.పథకం 21 సంవత్సరాల తర్వాత మెచ్యూర్ అవుతుంది. కుమార్తెకు 18 సంవత్సరాలు నిండినప్పుడు, ఆమె సుకన్య సమృద్ధి ఖాతా నుండి మొత్తంలో 50% విత్‌డ్రా చేసుకోవచ్చు.




సుకన్య సమృద్ధి యోజనలో పన్ను ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయిసుకన్య సమృద్ధి యోజనలో ప్రభుత్వం పన్ను ప్రయోజనాలను అందిస్తుంది. మూడు ప్రభావ దశల్లో పన్ను మినహాయింపు ఇవ్వబడుతుంది. ఆదాయపు పన్ను చట్టంలోని 80%జ% కింద, మీరు వార్షిక పెట్టుబడికి రూ. 1.50 లక్షల పన్ను మినహాయింపు పొందవచ్చు. అంతేకాదు ఈ పథకంలో వచ్చే ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు.ఈ స్కీమ్‌లో రద్దు చేసిన తర్వాత అందుకున్న మొత్తంపై పన్ను లేదు, అంటే, ఇది పన్ను రహితం.

## కాంగ్రెస్ చేతగానితనం వల్లే కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత : సుంకె రవిశంకర్



భువనగిరి : శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీ కి అప్పగించడం వల్ల నల్గొండకు తీవ్ర నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, ఛలో నల్లగొండ భువనగిరి కోర్డినేటర్ సుంకె రవిశంకర్ చెప్పారు.గురువారం భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భువన గిరి నియోజకవర్గం ముఖ్య నేతలతో చలో నల్లగొండ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిట్టా బాలకృష్ణ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు తదితరులతో కలిసి ఛలో నల్లగొండ సభ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాల పంపిణీని కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించటం వల్ల ఎడమ కాల్వ రైతాంగం మళ్లీ తిరోగమనం అయ్యేలా పరిస్థితి వచ్చిందని వాపోయారు.సాగర్ డ్యామ్ కేంద్ర బలగాల చేతికి పోయాయని, మనల్ని అడుగు కూడా పెట్టనియ్యడం లేదని, ఇది కాంగ్రెస్ వాళ్లు చేసిన నిర్వాకమని ధ్వజమెత్తారు. కృష్ణా జలాలపై కేంద్రం పెతనంతో ఉమ్మడి నల్లగొండ రంగారెడ్డి, పాలమూరు జిల్లాలు సాగు, తాగునీరు కోసం కేంద్రం అనుమతి కోసం ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పదేళ్లుగా ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని, అధికారు లకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు మని రెండు నెలలు గడవకు ముందే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఏదో ఆశించే కాంగ్రెస్ ప్రాజెక్టులను అప్ప జెప్పుతున్నాదని ఆరోపించారు.

## ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



హైదరాబాద్: ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల గిరాకీ లేక ఇప్పటివరకు 18 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు.ఆటో డ్రైవర్లకు మద్దతుగా తాను ఆటోలో అసెంబ్లీకి వచ్చానని, అయితే ఆటోను లోపలికి అనుమతించలేదని చెప్పారు. ఆటోను ఎందుకు లోనికి రానివ్వలేదు? కార్లో వస్తేనే రానిస్తారా? అని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటోలో అసెంబ్లీకి చేరుకున్నారు. అయితే ఆయనను భద్రతా సిబ్బంది ఆటోలో లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆటోలకు అసెంబ్లీలోకి అనుమతి లేదని చెప్పడంతో ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది.

## ప్రకటనలకు పరిమితం కావొద్దు..

## కులగణన చేసి చూపించాలి



హైదరాబాద్ : గవర్నర్ ప్రసంగంలో బీసీ కులగణన)అంశాన్ని ప్రస్తావించడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ కేవలం ప్రకటనలకు పరిమితం కాకుండా కులగణన చేసి చూపించాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ (యూపీఎఫ్) కన్వీనర్ గట్టు రామచందర్ రావు(కో కన్వీనర్ బొల్ల శివ శంకర్, యూత్ కన్వీనర్ ఆలకుంట హరి డిమాండ్ చేశారు.గురువారం వారు హైదరాబాద్లో విలేకరులతో మాట్లాడుతూ.. కంటితుడుపు చర్యగా భావించి కులగణనను విస్మరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మాటలు చెప్పి మైమరిపించడం సరికాదని, చేతల్లో చేసి చూపించాలని సూచించారు. కులగణన ఏ విధంగా చేయబోతున్నారు, గడువు ఎంత, విధివిధానాలు ఏమిటి వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేవంటే ఎన్నికలు జరగనిచ్చే సమస్యే లేదని తేల్చిచెప్పారు. 2011లో కేంద్రం యూపీఏ ప్రభుత్వం రూ. 4500 కోట్లు ఖర్చు చేసి చేపట్టిన కులగణన నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు.

అలాగే, 2015లో కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేశారని, కానీ ఆ తర్వాత 2018లో ఒకసారి, 2023లో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ అప్పటి నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టడం లేదని ఎండగట్టారు. అలాగే, అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లోనే దానిపై నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని సూచించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించక తప్పదని తేల్చిచెప్పారు.

## నిర్మల్ జిల్లాలో దారుణం..

### ప్రియురాలి దారుణ హత్య



నిర్మల్: నిర్మల్‌జిల్లా ఖానాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. నడిరోడ్డుపై ప్రియురాలని హత్య చేశాడో యువకుడు. తనతో పెళ్లికి నిరాకరించిందని ప్రియురాలని హతమార్చాడు. అడ్డుకోబోయిన మరో ఇద్దరిపై కూడా దాడి చేశాడు. వివరాలు.. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ముగ్గురుపై అదే కాలనీకి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో షెట్పల్లి అలేఖ్య(23) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందారు. అలేఖ్య వదిన షెట్పల్లి జయా (25) , కొడుకు షెట్పల్లి రియన్స్ (3)కు తీవ్ర గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. ఆలేఖ్య, జయా, రియాజ్.. ఖానాపూర్ మార్కెట్‌కు వచ్చి పెళ్లి సామాను కొనుగోలు చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో శివాజీ నగర్ శివారులో శ్రీకాంత్ అనే యువకుడు కాపు కాసి దాడి చేశాడు.అయితే అలేఖ్యకు మరో

యువకుడితో నెల క్రితం వివాహం నిశ్చయమైంది. దీనిని తట్టుకోలేక అలేఖ్యపై ఈ దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. తనను కాదని మరో వ్యక్తితో పెళ్లికి ఒప్పుకోవడంతో గొడ్డలితో ఆమెపైకి దాడికి చేసినట్లు సమాచారం.

## రేపటి నుంచి గుణదల మేరీ మాత ఉత్సవాలు



ఎన్టీఆర్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుణదల మేరీ మాత ఉత్సవాలు రేపటి (శుక్రవారం) నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి.

వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను వికర్ జనరల్ మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్ ఆవిష్కరించారు. గుణదల ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్ర గురువులు ఇప్పటికే సకల ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రైతుల భారీ నిరసన.. అడ్డుకున్న పోలీసులు




ఢిల్లీ: వందలాది మంది రైతులు నిరసన తెలుపుతూ.. పార్లమెంట్ వరకు చేపట్టిన ర్యాలీని నోయిడాలోని మహామాయ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు పెట్టిన బారికేడ్స్‌ను దాటడానికి రైతులు ప్రయత్నించారు.దీంతో అక్కడ ఉద్రిత్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దానికి సంబంధించన వీడియో వైరల్ మారింది. నోయిడా ట్రాఫిక్ పోలీసులు ఈ రూట్‌లో నిరసన ర్యాలీ చేట్టవద్దని ముందుగా సమాచారం అందించినా రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. దీంతో అక్కడ అధికంగా ట్రాఫిక్ జామ్ చోటుచేసుకుంది.

అయితే నోయిడాలోని పలు గ్రామాల రైతుల తాము పార్లమెంట్ బయట తమ డిమాండ్ల కోసం నిరసన తెలుపుతామని ప్రకటించారు. తాము ట్రాక్టర్లు, బస్సులతో రాజాధాని ఢిల్లీకి నిరసనగా ప్రవేశిస్తామని తెలిపారు. వారంతా మహామాయ ఫ్లైఓవర్ వద్దకు చేరుకొని ఢిల్లీవైపు బయలుదేరుదామని నిర్ణయించుకున్నారు. కాగా.. ఒక్కసారిగా వందలది మంది రైతులు తమ వాహనాలతో గుమిగూడటంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీసులు రైతులను ర్యాలీ ముందుకు వెళ్లకుండా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు.నివాస అవసరాల కోసం సేకరించిన మొత్తం భూమిలో 10 శాతం, 64.7 శాతం పెంచిన భూ పరిహారం, రెసిడెన్షియల్ ప్లాట్‌లపై వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి, ఇతర ప్రయోజనాల కోసం తమ డిమాండ్లను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించడం లేదని భారతీయ కిసాన్ ఏక్తా సంఘ్ నాయకుడు సుఖ్‌బీర్ యాదవ్ మండిపడ్డారు. తమ డిమాండ్లను పరిష్కరించాలనే ఉద్దేశంతో రైతులమంతా పార్లమెం?ట్ వద్దకు నిరసన ర్యాలీ చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

## ఇండియా'కు మరో షాక్..

### ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన ఆప్



న్యూఢిల్లీ: ఇండియా కూటమి అసలు ఉంటుందా ఉండదా అని అనుమానాలు తలెత్తుతున్న వేళ కూటమి ఉనికిని ప్రశ్నించే మరో పరిణామం చోటు చేసుకుంది. ఇండియా కూటమిలో ఉన్న ప్రధాన పార్టీ అయిన ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్) ఏకపక్షంగా వ్యవహరించింది.కూటమిలో ఉన్న మిగిలిన పార్టీలతో సంప్రదించకుండా అస్సాంలోని మూడు ఎంపీ సీట్లకు పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ గురువారం ఢిల్లీలో ముగ్గురు అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. అనంతరం మాట్లాడుతూ ఇండియా కూటమి తమ అభ్యర్థులకు మద్దతిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.'ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయమై ఎప్పటినుంచో చర్చలు జరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. అభ్యర్థులను ఫైనల్ చేసి ప్రచారానికి వెళ్లాల్సి ఉంది

. కూటమి నిర్ణయాలు త్వరగా తీసుకోవాలి. మేం ఇండియా కూటమితోనే ఉన్నాం' అని పాఠక్ అన్నారు.ఇప్పటికే కూటమిలోని మరో ప్రధాన పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) 16 మంది అభ్యర్థులతో యూపీలో తన తొలిజాబితాను ప్రకటించింది. ఓ పక్క కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతుండగానే ఎస్పీ 16 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించడం వివాదాస్పదమైంది. తాజగా కూటమిలోని ఆప్ పార్టీ కూడా ఇదే పని చేయడంతో కూటమి ఉందా లేదా అన్న ప్రశ్న ఉత్పన్నమయ్యే పరిస్థితి నెలకొంది.ఇండియా కూటమిలో కీలకంగా వ్యవహరించి ఒక దశలో కన్వీనర్ పదవి తీసుకుంటారని ప్రచారం జరిగిన బీహార్ సీఎం, జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్ ఇప్పటికే కూటమి నుంచి వైదొలిగి బీజేపీతో జతకట్టి బీహార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలన్నీ ఇండియా కూటమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీని కలవరానికి గురిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## విశాఖలో 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు పోటీలు



విశాఖపట్నం:డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీల ముగింపు కార్యక్రమం ఈ నెల 13న వైజాగ్‌లో జరగను ంది ఈ ముంగిపు పోటీల కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో జరిగే క్రికెట్ పోటీలను సీఎం జగన్ వీక్షించన్నారు.ఇక.. విజేత జట్టుకు రూ. 5 లక్షలు, రన్నరప్ జట్టు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 2 లక్షలు చొప్పున బహుమతి అందజేస్తారు. రాష్ట్రంలో 50 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. విశాఖలో రాష్ట్ర స్థాయిలో జరిగే 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో 5 కేటగిరీల్లో 3 వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.మరోవైపు.. రేపటి(శుక్రవారం) నుంచి విశాఖ రైల్వే స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా ప్రారంభించనున్నారు.

## ఇంతలోనే త్రాగునీటి కష్టాలు తలెత్తుతున్నాయి

**– పాలకులు మారినా నీటిమోత మారాడంలేదు**



వర్ధన్నపేట, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): త్రాగునీరు కోసం బిందెలతో వర్ధన్నపేట మండల ప్రజలు ఇప్పటికీ నెత్తిమోత మోస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కడారిగూడెం గ్రామంలో ఈ పరిస్థితి దాపురించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత నాలుగు రోజులుగా గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయిందని చెబుతున్నారు. త్రాగునీటి సమస్య నిర్మూలించడం కోసం ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రజలకు అంత సంతృప్తిని ఇవ్వడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. వారం రోజుల్లో మూడు రోజులు నీటి సరఫరా జరిగిందంటే మరో నాలుగు రోజులు పైపులైన్ల లీకేజీలు అంటూ అధికారులు సమాధానం చెబుతూ నీటి సరఫరా నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే వేసవికాలం సమీపించిన విధంగా నీటి సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి మండల పరిధిలో తలెత్తింది. రానున్న మండుటెండల్లో నీటి సమస్య పునరావృతమైతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందని మండల ప్రజలు భయభ్రాంతులౌతున్నారు. ఇలా మండల పరిధిలోని పలు గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఇదేవిధంగా తయారైంది. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన నెత్తి మూతతో త్రాగునీటి సమస్య మారడం లేదు. ఇంతలోనే త్రాగునీటి కష్టాలు తలెత్తయన్న చందంగా బిందెలు తలపై పెట్టుకుని నీటిని మోసే పరిస్థితి ఇప్పటికీ కొనసాగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా త్రాగునీటి సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి, మరోసారి నీటి సమస్య తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఐనవోలు మల్లన్న దేవాలయంలో మాసశివరాత్రి వేడుకలు



ఐనవోలు, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం మల్లికార్జున స్వామి దేవాలయంలో గురువారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల మేరకు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హెూమం, శ్రీ స్వామి వారి కళ్యాణం, ఒగ్గు పూజరులచే పెద్ద పట్నం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండిట్ గట్టు పురుషోత్తం శర్మ, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## .కేరళ వామపక్ష ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ఐనవోలు, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఐనవోలు మండల కార్యదర్శి కాడ బోయిన లింగయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కేరళ సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వంపై బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు ప్రారంభించిందన్నారు. దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తున్న కేరళ రాష్ట్రంపై కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన విషయంలో అధిక జోక్యం చేసుకొని గవర్నర్లను ప్రోత్సహిస్తూ, రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు ముగించి, ఆ రాష్ట్రానికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని సిపిఎం పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అన్ని రకాల నిధులను విడుదల చేసి, అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు డబ్బేట రాం కుమార్, పోచమ్మ, సృజన, రాజమణి, కొమురయ్య, బొమ్మకంటి యాకయ్య పద్మ, మల్లయ్య బుచ్చమ్మ తదితరులు ఉన్నారు

# అటవీ ప్రాంత ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

## – భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే ఐపీఎస్



భూపాలపల్లి, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం చేపట్టారు. జిల్లా పరిధిలోని పలిమెల, మహా ముత్తారం, భూపాలపల్లి, మండలాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 6 గొత్తికోయ గుంపుల నుంచి, అటవీ ప్రాంత ప్రజలు హాజరయ్యారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పి కిరణ్ ఖరే ఐపీఎస్ మాట్లాడుతూ అన్నింటి కన్నా ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. హైదరాబద్ మలక్ పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎస్పి తెలిపారు. మారుమూల ప్రజల ఆరోగ్యం పట్ల పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. మహాముత్తారం మండలం పెగడపల్లి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపుకు దాదాపు వెయ్యి మంది తరలిచ్చారు. ఈ సందర్భంగా వారికి వివిధ రకాల పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేసి, ఉచిత బోజన వసతి కల్పించామన్నారు. చలి తీవ్రతను తట్టుకోవడానికి 100 మంది గుత్తి కోయలకు దుప్పట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. రాబోవు కాలంలో గుత్తి కోయల అభ్యున్నత్తికై అనేక కార్యక్రమాలు చేపడతామని ఎస్పి కిరణ్ ఖరే తెలిపారు. అటవీ ప్రాంత, గుత్తి కోయల కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డిఎస్పీ జి రామ్మోహన్ రెడ్డి, డిఎంహెచ్వో మధుసూధన్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది, హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్స్ డాక్టర్ల బృందం, ముత్తారం ఎంపీడీవో, జడ్పిటిసి, ఎంపీటీసీ, కాటారం, భూపాలపల్లి, మహాదేవ్ పూర్ సిఐలు అర్జున్ రావు, నరేష్ కుమార్, రాజేశ్వర్ రావు, భూపాలపల్లి డాక్టర్ లు కిరణ్, శ్రీనివాస్, కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలిసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి నియోజక వర్గ అభివృద్దే ధ్యేయం

## – ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సి రెడ్డి



రాయపర్తి, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి నియోజక వర్గ అభివృద్ధి తమ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు.
నియోజకవర్గంలోని అన్ని గ్రామలను ఆదర్శ గ్రామలుగా తీర్చిదిద్దడానికి కార్యకర్తలందరు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు. ఎవరికీ ఏ అవసరం, కష్టం వచ్చిన ఆమె అందుబాటులో ఉంటూ ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్చార్జిగా పనిచేసేది అధికారం కోసం కాదన్నారు. నియోజక వర్గ ప్రజలకు సేవచేసెందుకు మాత్రమే అన్నారు. అందువల్ల నియోజక వర్గ పరిధిలో ప్రజా సమస్యలు ఏమున్నా తమ దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. అవినీతికి తమ దగ్గర చోటు లేదనీ పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో భూదందాలు ఎక్కువగా జరిగాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పాలకుర్తి నియోజక వర్గ పరిధిలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలికితీస్తామన్నారు. తప్పు చేశారని తెలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యా నాయక్, మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఈరెడ్డి నర్సింహా రెడ్డి, వివిధ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

## విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి



వర్ధన్నపేట, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సమాచార ధ్రువీకరణ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ చేపట్టింది. గురువారం ఏడీఈ కన్న రాజు తెలిపిన వివరాల మేరకు ప్రజాపాలనా కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కోసం అందించిన దరఖాస్తులపై విద్యుత్ అధికారులు గ్రామాల వారిగా పర్యటిస్తున్నారు. ధృవీకరణ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది వినియోగదారుల వద్దకు వచ్చినపుడు ప్రజా పాలన దరఖాస్తు రసీదు , ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) నెంబర్, ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఒకవేళ ఏదైనా అనివార్య కారణాల వల్ల విద్యుత్ అధికారులు వచ్చినపుడు వినియోగదారులు అందుబాటులో లేకపోతే ప్రజా పాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు నెంబర్, ఆధార్ కార్డు నెంబర్ ఆధారాలతో దగ్గరలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయం లేదా విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో వినియోగదారుల వివరాలను ధ్రువీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు

# మేడారం మహా జాతరను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ములుగు, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): గిరిజన సాంప్రదాయాల ప్రకారం మేడారం మహా జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం మేడారంలోని హరిత హెూటల్ సమావేశ మందిరంలో కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో గిరిజన సాంప్రదాయాలు ఉట్టిపడేలా, రద్దీ ప్రాంతాలలో గిరిజన ప్రత్యేక పెయింటింగ్స్ చేయడం జరిగిందన్నారు. జాతరలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగినప్పటికీ మంది పారిశుధ్య కార్మికులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఐటిసి, సింగరేణి, సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాల ద్వారా కూడా పారిశుధ్య పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. యానిమల్ కంపోజ్, టాయిలెట్ వేస్టేజ్ ప్రాసెసింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జాతరలో వేస్టేజ్ గల్ఫర్స్ సంఖ్య పెంచుతామని చెప్పారు. ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 14 క్లస్టర్, 279 యూనిట్స్ ద్వారా 5,532 టాయిలెట్స్ ఏర్పాటు చేయడం, నూతనంగా 230 కొత్త బోర్ వెల్స్ ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్న వాగు లోతట్టు ప్రాంతాలు, రద్దీ ప్రదేశాలలో గజ ఈతగాల్లను ఏర్పాటు చేశామన్నారు. జాతర సమయంలో 14 నుంచి 16 తేదీన లక్నవరం సరస్సు నీటిని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు వైద్యశాఖ నుంచి 30 ప్రత్యేక హెల్త్ క్యాంపులు, అంబులెన్స్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్టీసి మహిళ సిబ్బందికి టికెట్ కౌంటర్స్ వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు 6000 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14 వేల మంది పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జాతరలో ప్రత్యేక ప్రణాళికల ద్వారా ట్రాఫిక్, క్రైమ్, భక్తుల రద్దీ కంట్రోల్ చేయడం జరిగింది అన్నారు. వనదేవతలను తీసుకొచ్చే సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది, రోప్ పార్టీ ద్వారా దేవతల ప్రతిష్టకు భంగం కలగకుండా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జాతరలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. వీఐపీ, వీవీఐపీల దర్శనం వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూస్తామని తెలిపారు.

## నూతన భాధ్యతలు చేపట్టిన హనుమకొండ సీఐ

**- స్వాగతం తెలిపిన స్టేషన్ సిబ్బంది**



వరంగల్, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. గురువారం హనుమకొండ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఎడ్లపల్లి సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం తెలుపుతూ శుభాకాంక్షలు తెలిపారు. రామారావు ఎస్సై తదితరులు ఉన్నారు.

శుక్రవారం
9 ఫిబ్రవరి 2024
జర్నలిస్ట్ వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

# పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

– జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



భూపాలపల్లి, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): ట్రైబల్ వెల్ఫేర్ ఏటూరునాగారం ఐటిడిఏ నుండి ఋణాలు పొందిన 4 గిరిజన జే.ఎల్.జి సంఘాలకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని గిరిజన శాఖ నుండి 4 యూనిట్లకు గాను 113,50 లక్షలు మంజూరు కాగా ఇందులో ఒక సిమెంట్ ఇటుకల తయారు యూనిట్ 20 లక్షలతో రెండు కాంక్రీట్ మిక్సింగ్ రెండు యూనిట్లు ఒక్కో యూనిట్ 40 లక్షల వ్యయంతో ఒక ఫుడ్ ట్రక్స్ వీల్ 13,50 వేలతో మంజూరీగా మొత్తం నాలుగు యూనిట్లకు గాను 35 మంది సభ్యులు ఉండగా ఒక్కో గ్రూప్ నుండి ఇద్దరి చొప్పున కలెక్టర్ కార్యాలయంలో హాజరైనారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంజూరైన ఋణాలతో మీరు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. లబ్ధిని పొందినవారు మరికొంత మంది గిరిజనులకు ఉపాధి కలిపించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏఏపిఓ వసంతరావు, డి ఆర్ డి ఏ పురుషోత్తం, గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ప్రమాధ భీమా చెక్కుల పంపిణీ



భూపాలపల్లి, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): ధర్మపురి పట్టణ కేంద్రంలోని లక్ష్మీ నరసింహ గార్డెన్లో గురువారం భారత రాష్ట్ర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామానికి చెందిన పాదం శ్రీకాంత్, పెగడపల్లి మండలం వెగలాయిపేట గ్రామ చెందిన ఆత్మకూరి స్వామి, బుగ్గారం మండలం ముద్దునూరు గ్రామానికి చెందిన బండారి చిన్న శాంతమ్మ వివిధ ప్రమాదాలకు గురై మృతి చెందారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రమాద బీమా ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల చెక్కులు తెలంగాణ తొలి అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనా చారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తదితరులు ఉన్నారు.

# ఏసీబీ వలలో చిక్కుకున్న కొండమల్లేపల్లి ఆర్ఐ



దేవరకొండ, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): కొండమల్లే పల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి రైతువద్ద లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. వివరాల్లోకి వెళితే కేశ్య తండా గ్రామానికి బానవత్ లచ్చు రైతు వద్ద నుండి 30 వేల లంచం తీసుకుంటూ దేవరకొండ మీనాక్షి సెంటర్ వద్ద తన కార్ లో డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గతంలోనూ తనపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

# ఆయన చేసినదాంట్లో విజయ్ 30% చేసినా చాలు..

దళపతి విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరుతో పార్టీని ప్రారంభించడంతో తమిళనాట పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారాయి. అయితే విజయ్ సొంతంగా మాట్లాడకుండా తన తరఫున బుస్సీ ఆనంద్ మీడియా ద్వారా ప్రకటనలు చేస్తే గెలవరని నటుడు, నిర్మాత కె.రాజన్ అన్నారు.

ఆయన ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఎంజీఆర్ ప్రజలకు చేసిన సేవల్లో 30 శాతం చేస్తే విజయ్ రాజకీయాల్లో రాణిస్తారన్నారు. ఆయన ప్రజలకు మంచి చేస్తారని భావిస్తున్నానన్నారు. నినైవెల్లా నీయడా చిత్ర ఆడియో ఆవిష్కరణ వేదికపై కె.రాజన్ పై వ్యాఖ్యలు చేశారు.

ఇళయరాజా సంగీతం..

లేఖా క్రియేటర్స్ పతాకంపై రాయల్ ప్రభు నిర్మించిన చిత్రం నినైవెల్లా నీయడా. సెటిలైంది, రణతంత్ర, ఆరువా సౌండ్ వంటి హిట్ సినిమాల ఫేమ్ ఆదిరాజన్ ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు రాసి దర్శకత్వం వహించారు. ప్రాజన్, మనీషాయాదవ్ జంటగా నటించగా రాజా భట్టార్జి చాయాగ్రహణం, ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఇది ఇళయరాజా సంగీతం అందించిన 1,417వ చిత్రం కావడం విశేషం. చిత్ర ఆడియో లాంచ్ మంగళవారం సాయంత్రం నిర్వహించారు.



ఆయన్ను కలవడమే కష్టమన్నారు..
ఈ కార్యక్రమంలో నటుడు, నిర్మాత కె.రాజన్, దర్శకుడు పేరరసు, ఆర్వీ ఉదయకుమార్, నిర్మాత కేఆర్ సినీ ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చిత్ర దర్శకుడు ఆదిరాజన్ మాట్లాడుతూ.. ఇది మధురైలో తన మిత్రుడి జీవితంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా రూపొందించిన ప్రేమ కథా చిత్రం అని చెప్పారు. ఇందులో 70 శాతం వాస్తవం కాగా 30 శాతం కల్పితమని పేర్కొన్నారు. ఇళయరాజాను చేరడమే కష్టమని కొందరు చెప్పారని, అలాంటిది ఈ చిత్రానికి ఆయన సంగీతాన్ని అందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇళయరాజాతో పనిచేయడం మంచి అనుభవంగా పేర్కొన్నారు.

# కవిత వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించడమే: కొండ సురేఖ

హైదరాబాద్: టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డిని తప్పించాలని కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి కొండ సురేఖ అన్నారు. ఆంధ్ర వ్యక్తిని నియమించారని మాట్లాడటం చూస్తుంటే..

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. పదేండ్లు పాలన చేసిన వాళ్లు రెండు నెలల పాలనపై విమర్శలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాల కాంట్రాక్టులను పెంచి పోషించినది కేసీఆరేనని అన్నారు. మహేందర్ రెడ్డి అవినీతి అధికారి అయితే బీఆర్ఎస్ పాలనలో డీజీపీగా ఎందుకు పెట్టారు? అని నిలదీశారు. సింగరేణిలో ఉద్యోగాలు ఇస్తే తప్పుపడుతున్నారు కానీ బీఆర్ఎస్ దళారులు సింగరేణిలో ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. నిరుద్యోగులకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. మహేందర్ రెడ్డి



మీలాగా లిక్కర్ స్కామ్, పేపర్ లీక్ చేశారా? లేక ఒకే రూమ్ లో కావాల్సిన వాళ్లకు పరీక్షా రాయించారా? అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వలేదు.. తాము ఇస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.సింగరేణి నిధులు, ఉద్యోగాలు ఎవరు తన్నుకుపోయారో అందరికి తెలుసని కొండ సురేఖ అన్నారు. సింగరేణిలో డిప్యూటేషన్, బదిలీలకు లెటర్లు ఇచ్చి ఎంత దండుకున్నావ్.. లెక్కలు తీయాలా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే ఈ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవదని జోస్యం చెప్పారు.

# నేరుగా వెళ్లి పులిబోనులో పడ్డట్లుగా.. జనసేన రాజకీయ వైనం!

ఆంధ్రప్రదేశ్‌లో జనసేనలో జరుగుతున్న పరిణామాలు కచ్చితంగా ఆ పార్టీలో అంతర్మధనానికి దారితీసేవే. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ లొంగుబాటు తనానికి, పార్టీ కార్యకర్తల ఆత్మాభిమానానికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతన్నట్లు కనిపిస్తుంది.పార్టీ అభిమాని, కాపు సంక్షేమ సేననేత, మాజీ మంత్రి హరిరామజోగయ్య రాసిన లేఖ ఇందుకు దర్పణంగా కనిపిస్తుంది.పవన్‌కళ్యాణ్ తన చేతిలో ఉండాల్సిన రాజకీయాన్ని, చేజేతులారా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టి, ఆయన ఇంటి చుట్టూ తిరిగే దైన్య స్థితిని తెచ్చుకోవాడాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. పవన్‌కళ్యాణ్ ఎటూ ముఖ్యమంత్రి పదవి వస్తుందని అనుకోవడం లేదు. చంద్రబాబు కుమారుడు లోకేష్ ఆ విషయం స్పష్టంగా చెప్పిన సంగతి తెలిసిందే. దానికి పవన్ కూడా ఆమోదముద్ర వేశారు. తద్వారా కాపు సామాజికవర్గం గుండెల్లో గునపాలు దించినంత పనిచేశారు. గత కొన్ని దశాబ్దాలుగా సీఎం అభ్యర్థిగా తమ వర్గం వ్యక్తి ఉండాలని కాపులు కోరుకుంటున్న మాట వాస్తవం.

ఈ క్రమంలో పవన్‌కళ్యాణ్ తమ ఆశలకు ఊయల వేస్తారని వారంతా భావించారు. కాని ఆయనేమో తెలుగుదేశం ఊయలను ఊపి ఆనందపడే వ్యక్తిగా మారిపోవడం వారికి జీర్ణం కావడం లేదు. ఒకటికి, రెండుసార్లు చంద్రబాబు ఇంటికి పవన్ వెళ్లి సాధించింది ఏమిటంటే ఓ ఇరవై అసెంబ్లీ సీట్లు, రెండు లోక్ సభ సీట్లు సాధించడమా! మరో ఐదు సీట్లు ఇవ్వాలని చంద్రబాబును బతిమలాడుకోవడం కూడా ఎంత పరువు తక్కువగా ఉంది! కొద్ది రోజుల క్రితం తెలుగుదేశం పత్రిక అయిన



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని జాగ్రత్తగా చదివితే ఈ విషయం అర్థం అవుతుంది. మిగిలిన పత్రికలలో పవన్ 38 సీట్లు అడిగితే 28 సీట్లు ఇవ్వడానికి చంద్రబాబు సిద్ధపడ్డారని, మరో నాలుగు సీట్లు ఇవ్వాలని కోరుతున్నారని వార్తలు వచ్చాయి. కానీ టీడీపీ అధికార మీడియా మాత్రం జనసేనకు ఇరవై సీట్లే ఇస్తే సరిపోతుందన్నట్లు కథనాన్ని ఇచ్చింది. తెలుగుదేశం పార్టీ తాను గెలవలేనన్న భయంతో పవన్‌కళ్యాణ్‌తో జత కడితే ఏమైనా ప్రయోజనం ఉంటుందేమో అన్న ఆశతో ఆయనను బుట్టలో వేసుకుంది. కారణం తెలియదు కానీ, పవన్‌కళ్యాణ్ తన జుట్టును టీడీపీలో చేతిలో పెట్టేశారు.అవినీతి కేసులో చిక్కి రాజమండ్రి జైలులో చంద్రబాబు ఉన్నప్పుడు పవన్‌కళ్యాణ్ పలకరించడానికి వెళ్లారు. అంతవరకు ఆక్షేపణ లేదు. కాని ఆ తర్వాత ఎలాంటి సంప్రదింపులు లేకుండానే టీడీపీతో పొత్తు ప్రకటన చేసి జనసేన క్యాడర్‌ను గందరగోళంలోకి నెట్టేశారు. పవన్ అనుభవరాహిత్యంతో పై చేయిగా ఉండాల్సిన జనసేనను టీడీపీ కాళ్ల దగ్గర పడేశారన్నది పలువురు జనసేన నేతల భావనగా ఉంది. అదే పవన్‌కళ్యాణ్ మర్యాదపూర్వక సంబంధాలు కొనసాగించి, సీట్ల విషయంలో ఏమీ మాట్లాడకుండా, రాజీ పడకుండా కూర్చుని ఉంటే చంద్రబాబే ఈయన ఇంటికి తిరగవలసి వచ్చేదన్నది వారి అభిప్రాయం. అప్పుడు తమ డిమాండ్ ప్రకారం సీట్లు పొందే అవకాశం ఉండేదని వారు చెబుతున్నారు. పైగా తాము అడగకుండానే పవన్ తానే పొత్తు ప్రతిపాదించారని టీడీపీ నేతలు చెబుతూ ఆయన గాలి తీసేశారు. సీఎం పదవికి అవసరమైన అనుభవం, సమర్థత చంద్రబాబుకే ఉన్నాయని, ఆ విషయం పవన్ కూడా ఒప్పుకున్నారని లోకేష్ ప్రకటించడం ద్వారా ఆయన పరువు పూర్తిగా తీసేశారు. ఉప ముఖ్యమంత్రి పదవి విషయం కూడా టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశంలో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని లోకేష్ అన్నప్పటికీ పవన్ స్పందించకపోవడం జనసేనలో చాలామందికి జీర్ణం కాలేదు

# 1.5 డిగ్రీలు వేడెక్కిన ప్రపంచం.

## ఏడాదంతా రికార్డులు బద్దలు



న్యూఢిల్లీ: గ్లోబల్ వార్మింగ్ అంటే ఏంటో తెలిసొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఏడాది అంతా రికార్డు స్థాయిలో టెంపరేచర్లు నమోదు అయ్యాయి.గడిచిన 12 నెలలూ.. భూభాగం అంతటా 1.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు తాజా రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. యురోప్‌కు చెందిన వాతావరణ శాఖ నిపుణులు ఈ నివేదికలను రిలీజ్ చేశారు. ఇది నిజంగా మానవాళికి వార్నింగే అని పేర్కొన్నారు. ఈయూకి చెందిన కొపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ ఈ రిపోర్టును రిలీజ్ చేసింది. 2023 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి వరకు నమోదు అయిన ఉష్ణోగ్రతల ఆధారంగా ఈ విషయాన్ని చెప్పారు. 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదు అయినట్లు సీ3ఎస్ పేర్కొన్నది.తుఫాన్లు, కరువు, కార్చిచ్చులతో అన్ని ప్రాంతాల్లోనూ వాతావరణ మార్పులు చోటుచేసుకున్నాయి. ఎల్ నినో వెదర్ ప్రభావం కూడా సముద్రాలపై పడింది. ముఖ్యమంతా పసిఫిక్ మహాసముద్రంలో మార్పులకు కారణమైంది. గ్లోబల్ రికార్డుల ప్రకారం 2023 హాటెస్ట్ ఇయర్‌గా రికార్డు అయ్యింది. 1850 తర్వాత ఆ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా ఎండలు మండిపోయినట్లు రిపోర్టు ద్వారా వెల్లడైంది అధిక ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటిపోకూడదని 2015లో ప్రపంచదేశాధినేతలు ప్రామిస్ చేసిన విషయం తెలిసిందే. పర్యావరణంలో పెను మార్పులు జరగకుండా ఉండాలంటే టెంపరేచర్లను అదుపులో ఉంచాలని పారిస్‌లో జరిగిన ఆనాటి ఒప్పందంలో నేతలు అంగకీరించారు. కానీ ఆ అగ్రిమెంట్‌కు చేరువగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. సగటున ఏడాదికి 1.5 డిగ్రీల వేడి పెరగడం శోచనీయమని రాయల్ మెటీరియోలాజికల్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ లిజ్ బెంట్లే తెలిపారు. ఈ ఏడాది సముద్ర ఉపరితలం కూడా ఎన్నడూలేనంత స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# మేడారం మహా జాతరకు ముందే అపశృతి

– జంపన్నవాగులో గల్లంతై భక్తుడు మృతి

ములుగు, ఫిబ్రవరి 8(జర్నలిస్ట్ వార్త): మేడారం మహాతరకు ముందే గురువారం అపశృతి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వనదేవతల దర్శనం కోసం వచ్చిన మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన స్వాగత్ (23) తన కుటుంబ సభ్యులతో మనదేవతల దర్శనార్థం మేడారం జాతరకు చేరుకున్నారు. స్నానానికి వెళ్లిన స్వాగత్ జంపన్న వాగులో గల్లంతైనారు. మృతుని కోసం గాలించిన ఈతగాళ్లకు స్వాగత్ చివరకు ప్రాణాలు కోల్పోయిన తరువాతే లబ్యమైనారు. సంబరంగ కుటుంబ సభ్యులతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు చివరకు రోదన ఎదురైంది. ఈ సంఘటన కారణంగా మృతుని కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు.

# మళ్లీ అదే మ్యాజిక్ చేసిన విజయ్ దేవరకొండ..

## ఈ సారి సమ్‌థింగ్ స్పెషల్




హీరోలకి దర్శకులతో, హీరోయిన్లతో హిట్ కాంబినేషన్స్ ఉండటం పెద్ద విషయం కాదు. కానీ సింగర్స్‌తో క్లాసిక్ కాంబినేషన్ ఉంటే మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. ఒకప్పుడు అలాంటి బాండింగ్ ఉండేది. ఇప్పుడు మళ్లీ ఆ మ్యాజిక్ విజయ్ దేవరకొండ, సిద్ శ్రీరామ్‌తో రిపీట్ అవుతుంది. తాజాగా ఈ కాంబోలో మరో మ్యాజికల్ సాంగ్ వచ్చింది. విజయ్, సిద్ కాంబినేషన్‌పై స్పెషల్ స్టోరీ. ఈ రోజుల్లో పాట వినగానే ఇన్‌స్టంట్ హిట్ అవ్వడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఆ మ్యాజిక్ విజయ్ దేవరకొండ, సిద్ శ్రీరామ్ విషయంలో ప్రతీసారి జరుగుతుంది.

హీరోలకి దర్శకులతో, హీరోయిన్లతో హిట్ కాంబినేషన్స్ ఉండటం పెద్ద విషయం కాదు. కానీ సింగర్స్‌తో క్లాసిక్ కాంబినేషన్ ఉంటే మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. ఒకప్పుడు అలాంటి బాండింగ్ ఉండేది. ఇప్పుడు మళ్లీ ఆ మ్యాజిక్ విజయ్ దేవరకొండ, సిద్ శ్రీరామ్‌తో రిపీట్ అవుతుంది. తాజాగా ఈ కాంబోలో మరో మ్యాజికల్ సాంగ్ వచ్చింది. విజయ్, సిద్ కాంబినేషన్‌పై స్పెషల్ స్టోరీ..

ఈ రోజుల్లో పాట వినగానే ఇన్‌స్టంట్ హిట్ అవ్వడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఆ మ్యాజిక్ విజయ్ దేవరకొండ, సిద్ శ్రీరామ్ విషయంలో ప్రతీసారి జరుగుతుంది. ఈ కాంబోలో పాట వచ్చిందంటే చాలు.. చార్ట్‌బస్టర్ పక్కా. తాజాగా ఫ్యామిలీ స్టార్ నుంచి విడుదలైన నంద నందనా సాంగ్‌కు అదే రెస్పాన్స్ వస్తుంది.
గతంలోనూ విజయ్, సిద్ కాంబినేషన్‌లో చాలా పాటు వచ్చాయి. ఖుషీలో ఆరాధ్య పాట కూడా చాలా రోజులు ట్రెండింగ్‌లో ఉండిపోయింది. ఇక లైగర్ ఫ్లాప్ అయినా.. అందులో సిద్ శ్రీరామ్ పాడిన కలలో కూడా అంటూ సాగే పాట మంచి హిట్ అయింది. ఇక డియర్ కామ్రేడ్‌లోనూ కడలల్లే వేచె మనసే పాట బంపర్ హిట్ అయింది.

## ● - గుంటూరు కారం ఓటీటీ వివరాలు ఇవే.!



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా డిజిటల్ ప్రీమియర్ రాబోతోంది. ఈ చిత్రం సంక్రాతికి విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా రూ. 114.3 కోట్ల ముగింపు షేర్ సాధించింది.
గుంటూరు కారం సినిమాను ఫిబ్రవరి 9 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం చేయనున్నారు. తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషలలో విడుదల చేశారు.ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను మహేష్ బాబు కెరీర్‌లోనే రికార్డు ధరకు నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. స్ట్రీమింగ్ డీల్ ప్రకారం, సినిమా థియేట్రికల్ రిలీజ్ అయిన 4 వారాల తర్వాత స్ట్రీమ్ చేయడానికి షెడ్యూల్ చేశారు. నెట్‌ఫ్లిక్స్ బృందం 4 వారాలలో స్ట్రీమింగ్ డేట్ ను ప్రకటించింది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శ్రీలీల, రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, జయరామ్, మీనాక్షి చౌదరి తదితరులు నటించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రానికి ఎస్ఎస్ థమన్ సంగీతం అందించారు.



# 'రవితేజతో సినిమా చేయాలనుకున్నా': బేబీ నిర్మాత

మణికందన్, గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా "ట్రూ లవర్". ఈ విభిన్నమైన ప్రేమ కథ చిత్రాన్ని దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రూపొందించారు.

ఈ సినిమాను డైరెక్టర్ మారుతి, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్కేఎన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 10వ తేదీన థియేటర్లలో రిలీజవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్కేఎన్, మారుతి పాల్గొన్నారు.
నిర్మాత ఎస్ కేఎన్ మాట్లాడుతూ – 'ఈ సినిమా తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఇటీవల ఇలాంటి మంచి లవ్ స్టోరి రాలేదని చెబుతున్నారు. తెలుగు ఆడియెన్స్‌కు కూడా ఈ సినిమా నచ్చుతుంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మా బేబి సినిమాకు కూడా ఇలాగే ముందు రోజు ప్రీమియర్ వేశాం. కంటెంట్ మీద మాకు నమ్మకం ఉంది. మారుతికి యూత్ సినిమాలంటే ఇష్టం. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. రవితేజ ఈగల్‌తో మా సినిమాకు పోటీ లేదు. మాస్ మహారాజ్ రవితేజ అంటే నాకు ఇష్టం. నేను ఆయనతో ఓ సినిమా కూడా చేయాలని అనుకున్నా. బేబి హిందీ రీమేక్‌లో నేను నటిస్తున్నాననే అనే వార్తల్లో నిజం లేదు' అన్నారు.
దర్శకుడు మారుతి మాట్లాడుతూ – 'నేను ఈ సినిమా ఫస్ట్ టైమ్ చూసినప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. తమిళ ప్రీమియర్స్ తర్వాత సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు చూస్తున్నప్పుడు అంతే సంతోషం కలిగింది. ఈ సినిమా కథను దర్శకుడు చాలా జెన్యూన్‌గా తెరకెక్కించాడు. అబ్బాయిలు, అమ్మాయిలే కాదు ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా ఇది. ఈ మూవీతో వాలెంటైన్స్ డే మర్చిపోలేకుండా ఉంటుందని చెప్పగలను. ప్రస్తుతం ప్రభాస్ సినిమా చేస్తూ బిజీగా ఉన్నా. ఇదొక మంచి సినిమా కావడం వల్లే ఇంతగా ప్రమోట్ చేస్తున్నాం. తెలుగులో ఇప్పటివరకు ఇలాంటి పాయింట్‌తో సినిమా రాలేదు.' అన్నారు.




# భీమా' మూవీ ఫస్ట్ సింగిల్ రిలీజ్

టాలీవుడ్ హీరో గోపీచంద్ హీరోగా నటించిన సినిమా 'భీమా'. ఈ సినిమలో మాళవిక శర్మల హీరోయినిగా నటించారు. ఈ సినిమాకి కన్నడ డైరెక్టర్ ఏ హర్ష దర్శకత్వం వహించారు.
తాజాగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ 'ఏదో ఏదో మాయ' సాంగ్ ప్రోమోను రిలీజ్ చేసారు. ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతం అందించారు. ఈ సినిమాని చిత్రబృందం థియేటర్‌లలో మార్చి 8, 2024న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

# తేజ సజ్జ నెక్ట్స్ మూవీ ఫిక్స్..

## అది కూడా మైథలాజికల్ సబ్జెక్టే.. డైరెక్టర్ ఎవరంటే?

చిన్న సినిమాగా వచ్చిన హనుమాన్ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడమే కాదు దాదాపు 300 కోట్ల రూపాయల కలెక్షన్లు సాధించి ఆల్ టైం రికార్డులు సెట్ చేసింది.

ఇప్పటి వరకు 92 ఏళ్ల టాలీవుడ్ హిస్టరీలోనే మునుపెన్నడూ లేని విధంగా సంక్రాంతి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజ సజ్జ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా చిన్న సినిమా గానే మొదలైంది. కానీ టీజర్ ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత స్పాన్ పెరుగుతూ వెళ్ళింది. ఆ సంగతి అలా ఉంచితే ఇప్పుడు తేజ సజ్జ చేయబోయే తరువాతి సినిమా గురించి క్లారిటీ వచ్చేసింది. ఆయన తన తరువాతి సినిమా ఈగల్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో చేయబోతున్నాడు. ఈగల్ ప్రమోషన్స్ లో భాగంగా ఈ విషయాన్ని కార్తీక్ ఘట్టమనేని వెల్లడించారు.

%ూాఏ్తీవం వీబతీఎవతీవఎ%: మందుకు డబ్బివ్వలేదని కొడుకు చేతిలో నటి దారుణ హత్య



తేజతో చేయబోయే సినిమా కొంచెం మైథలాజికల్ టచ్ ఉన్న సినిమా అని దేవుళ్ళ కాన్సెప్ట్ ఉండదు కానీ హిస్టరీకి సంబంధించిన సినిమాగా ఉంటుందని కార్తీక్ ఘట్టమనేని చెప్పుకొచ్చారు. కొంచెం ఫాంటసీ మూవీలా ఉంటుందని ఆయన అన్నారు. ఇక ప్రశాంత్ వర్మ చేయబోతున్న జై హనుమాన్ సినిమాలో పూర్తిస్థాయిలో తేజ కనిపించకపోవచ్చు. లేదా తేజను ప్రధానంగా పెట్టుకుని కూడా ప్రశాంత్ వర్మ కథ రాసుకుంటూ ఉండి ఉండవచ్చు. ఆ విషయం కథ పూర్తి అయ్యాకే క్లారిటీ వస్తుంది. ప్రస్తుతానికి ప్రశాంత్ వర్మ తేజ నిర్మాత నిరంజన్ రెడ్డి సినిమాని అమెరికాలో ప్రమోట్ చేస్తున్నారు. సినిమా విడుదలై నాలుగు వారాలు పూర్తి అవుతున్నా సరే అమెరికాలో ఇంకా ఈ సినిమా మీద ప్రేక్షకుల్లో క్రేజ్ కనిస్తోంది.. దానిని మరింత పెంచేందుకు ఈ టీం అమెరికా వెళ్లి పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తోంది.